క్లుప్తంగా

బైక్ చోరీ

ఉదయగిరి: ఇంటి ముందు నిలిపి ఉంచిన బైక్‌ను దొంగలు అపహరించిన ఘటన పట్టణంలోని ఇందిరానగర్‌కాలనీలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలు.. ఇందిరానగర్ కాలనీకి చెందిన నాగార్జున రోజూలాగే తన హీరో గ్లామర్ బైక్‌ను శుక్రవారం రాత్రి తన ఇంటి ముందు నిలిపి ఉంచారు. శనివారం ఉదయం లేచి చూడగా బైక్ కనిపించలేదు. తన ఇంటి సీసీకెమెరా ఫుటేజీని పరిశీలించగా చోరీ ఘటన నమోదైంది. అర్ధరాత్రి 2.16 గంటల సమయంలో ఓ వ్యక్తి ముసుగు ధరించి బైక్‌ను అపహరిస్తూ కనిపించాడు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీసీరోడ్డు పనుల ప్రారంభం



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పంచాయతీ పరిధిలోని వడ్డిపాళెంలో సీసీరోడ్డు నిర్మాణ పనులను పంచాయతీరాజ్ ఏఈ తిరుమలయ్య శనివారం ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం నిధులతో వడ్డిపాళెంలోని మెయిన్‌రోడ్డు నుంచి పోలేరమ్మ గుడి, పాఠశాల ఆవరణం వరకు రూ.5లక్షలతో సీసీరోడ్డు నిర్మాణం చేపడుతున్నట్లుగా ఆయన తెలిపారు.

వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా కార్యదర్శిగా వెంకటసుబ్బయ్య



సోమశిల: చేజర్ల మండలం కోటితీర్థం గ్రామానికి చెందిన ఆత్మకూరు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ గోతం వెంకటసుబ్బయ్యయాదవ్ వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శిగా నియమితులయ్యారు, ఈ మేరకు వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవీ బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధనరెడ్డి, ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

భూ సమస్యలను పరిష్కరించాలని ధర్నా



ఉదయగిరి: భూ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం, అధికారులు రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేసి ఆన్‌లైన్‌లో అడంగల్ 1బీ అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రీ సర్వే తప్పిదాలను సరిచేయడంలో రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూసమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు.

సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు

సీతారామపురం : దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే చర్యలు తప్పవని ఎంఈఓ షేక్ మస్తాన్‌వలి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22 నుంచి అక్టోబర్ 2 వ తేదీ వరకు దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. అక్టోబర్ 3వ తేదీన పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు దసరా సెలవుల్లో ప్రత్యేక తరగతుల పేరుతో విద్యార్థులను ఇబ్బంది పెడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎల్ఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో అనుమతులు లేని లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన యజమానులు ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా రెగ్యులరైజేషన్ చేసుకుని ప్లాట్లను సురక్షితంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ కే శ్రీనివాసరెడ్డి సూచించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శి రామారావుతో కలిసి ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. మండల పరిధిలో 25 లేఅవుట్లు ఉండగా, వాటిలో కేవలం రెండింటికి మాత్రమే నుడా అనుమతులు ఉన్నాయన్నారు. మిగిలిన 23 లేఅవుట్లకు సక్రమమైన అనుమతులు లేనందున ఎల్ఆర్ఎస్ స్కీం ద్వారా వాటిని రెగ్యులరైజేషన్ చేసుకోవాలని సూచించారు. అక్టోబరు 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పోలీసులు కావలెను

- వింజమూరు స్టేషన్‌ను వేధిస్తున్న కొరత
- పనిభారంతో ఉన్నవారు సతమతం
- సవాల్‌గా శాంతిభద్రతల సమస్య



వింజమూరులో పోలీస్‌స్టేషన్

వింజమూరు(ఉదయగిరి): ఉదయగిరి నియోజకవర్గంలోనే వింజమూరు పట్టణం ఎక్కువ జనాభా కలిగి ఉంది. వాణిజ్య, వ్యాపార, విద్య, వైద్యపరంగా ఎంతో ప్రాముఖ్యతను కలిగిఉంది. వింజమూరులో సుమారు నాలుగు వేల మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వింజమూరు పరిసర ప్రాంతాలకు చెందిన వారు వైద్యం, ఇతర అవసరాల నిమిత్తం నిత్యం పెద్దసంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ఇంతటి ప్రాధాన్యత కలిగిన వింజమూరు పోలీసు స్టేషన్‌లో పోలీసుల కొరత కారణంగా శాంతి భద్రతల సమస్య సవాల్‌గా మారింది. మరోవైపు పనిభారంతో ఉన్న సిబ్బంది సతమతమవుతున్నారు.

27 మందికి 14 మందే..

వింజమూరు పోలీస్ స్టేషన్‌లో 27 మంది పోలీసులు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం 14 మంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ఏఎస్సైలు ఇద్దరు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఒక్కరు మాత్రమే ఉన్నారు. హెడ్‌కానిస్టేబుళ్లు ఆరుగురు ఉండాల్సి ఉండగా, ప్రస్తుతం ఒక్కరు కూడా లేరు. కానిస్టేబుళ్లు 18 మంది విధుల్లో ఉండాల్సి ఉండగా కేవలం ఏడుగురు మాత్రమే ఉన్నారు. వీరిలో కూడా ఒకరు కోర్టు పనుల నిమిత్తం ఎప్పుడు బయటే తిరగాలి. మిగిలిన వారిలో ప్రతిరోజూ ఒకరిద్దరు కానిస్టేబుళ్లు వివిధ స్టేషన్ల పనుల నిమిత్తం స్టేషన్‌లో అందుబాటులో ఉండే పరిస్థితి లేదు. వింజమూరు మండలంలోని గ్రామీణ ప్రాంతాల నుంచి నిత్యం ఏదోక సమస్యతో బాధితులను పోలీసు స్టేషన్‌ను ఆశ్రయిస్తుంటారు. పోలీసు సిబ్బంది కొరతతో సకాలంలో బాధితులకు న్యాయం జరగడం లేదు. మరోవైపు పోలీసులకు శాంతిభద్రతల సమస్య సవాల్‌గా మారింది.

వెంటాడుతున్న ట్రాఫిక్ సమస్య

వింజమూరు పట్టణం 20వేలకుపైగా జనాభా కలిగి ఉంది. వీరికి తోడు నిత్యం బయట ప్రాంతాల నుంచి వివిధ పనుల నిమిత్తం రెండు వేల మందికి పైగా రాకపోకలు సాగిస్తుంటారు.అంతేకాకుండా విద్యాసంస్థల్లో చదువుకునేందుకు నిత్యం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వందలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో పట్టణంలో తరుచూ ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు తగిన సిబ్బంది లేరు.దీంతో తరుచూ వాహనాదారుల మధ్య చిన్న చిన్న గొడవలు జరుగుతున్నాయి.

హోంగార్డుదే హవా

పోలీస్‌స్టేషన్‌లో ఏళ్ల తరబడి కొందరు హోంగార్డులు తిష్ట వేశారు. కొన్నేళ్లుగా ఇక్కడే ఉంటున్న వీరు కానిస్టేబుళ్ల కంటే ఎక్కువ హవా సాగిస్తున్నారు. అతి ముఖ్యమైన వ్యవహారాల్లో సైతం కొందరు హోంగార్డులు చెప్పిందే స్టేషన్‌లో వేదంగా ఉందనే ఆరోపణలు ఉన్నాయి. స్టేషన్ పరిధిలో జరిగే అక్రమ కార్యకలాపాల్లో వీరి పాత్ర ఎక్కువగా ఉందనే ఆరోపణలు ప్రజల నుంచి వినిపిస్తున్నాయి. ఏళ్ల తరబడి తిష్ట వేసిన హోంగార్డులను వేరేచోటుకు బదిలీ చేస్తే కొంతమేర అవినీతి కార్యకలాపాలను నియంత్రంచవచ్చనే భావన ప్రజల్లో వినిపిస్తోంది. ఈ దిశగా ఆచన చేయడమే కాకుండా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రజలు కోరుకుంటున్నారు. రెండో ఎస్సైను కూడా నియమిస్తే పని విభజన జరిగి శాంతిభద్రతలు అదుపులో ఉండే అవకాశం ఉంటుందని పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

మంచినీటి బావి నిర్మాణానికి స్థల పరిశీలన



సంగం: సంగం బ్యారేజ్ వద్ద మంచినీటి బావి నిర్మాణానికి ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్‌తో కలిసి మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఈఈ గిరిధర్ శనివారం స్థల పరిశీలన చేశారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీకి తాగునీటిని అందించేందుకు మంచినీటి పథకం నిర్మాణం చేపడుతున్నట్లు ఈఈ గిరిధర్ తెలిపారు. ఇరిగేషన్ ఎస్ఈ దేశ్‌నాయక్ మాట్లాడుతూ జిల్లాలో గతంలో ఓఎం కింద మంజూరై ఆగిన కాలువల పూడికతీత పనులను ప్రారంభించి సాగునీరు సవ్యంగా సాగేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. లస్కర్ల నియామకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వ అనుమతులు రాగానే నియామకం చేపడతామన్నారు. లస్కర్ల పెండింగ్ జీతాలను చెల్లిస్తామన్నారు. పబ్లిక్ హెల్త్ డీఈ జానకిరామ్‌రెడ్డి, ఏఈ జీవన్, ఇరిగేషన్ డీఈ పెంచలయ్య, ఏఈ వినయ్, కాంట్రాక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సంగం బ్యారేజ్‌కు భారీగా వరద నీరు



సంగం బ్యారేజ్ నుంచి విడుదలవుతున్న వరదనీరు

సంగం: సంగం బ్యారేజ్‌కు మరోసారి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఇటీవల సోమశిల నుంచి విడుదల చేయడం సంగం బ్యారేజ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరింది. ఆ తరువాత సోమశిల నుంచి నీటి విడుదలను తగ్గించడంతో బ్యారేజ్‌కు వరద ప్రవాహం తగ్గుముఖం పట్టింది. ప్రస్తుతం మరోసారి సోమశిలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో దిగువకు 26 వేల క్యూసెక్కులను విడుదల చేశారు. దీంతో సంగం బ్యారేజ్ అధికారులు అప్రమత్తమై సుమారు 20కు పైగా గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సంగం బ్యారేజ్‌కు దిగువన ఉన్న పెన్నా పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొనసాగుతున్న దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్



సమ్మె చేపడుతున్న దస్తావేజులేఖర్లు

కావలి(అల్లూరు): కావలి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయ ఆవరణలో దస్తావేజు లేఖర్లు చేపడుతున్న పెన్‌డౌన్ కార్యక్రమం శనివారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్లకు సంబంధించి నూతనంగా ప్రవేశపెట్టిన కార్డుప్రైమ్ 2.0 విధానంలో ఓటీపీ నిబంధనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పాత పద్ధతినే కొనసాగించాలని కోరారు. ప్రభుత్వం స్పందించని పక్షంలో నిరసన కార్యక్రమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. దస్తావేజు లేఖర్ల సంఘం అధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి ప్రసాద్, ట్రెజరీ వెంకటరావు, ప్రసాద్, రాములు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధరలు కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మర్రిపాడు: ప్రభుత్వం పంటలకు మద్దతు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ డిమాండ్ చేశారు. డీసీపల్లిలో శనివారం నిర్వహించిన సీపీఎం కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించక రైతులు నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను తెరవకపోవడంతో ఎడగారు ధాన్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దళారులు రైతులను దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పొగాకు, టమోట, ఉల్లి, సజ్జ పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు. రైతు సంఘ జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు గంటా లక్ష్మీపతి, దుత్తలూరు, మర్రిపాడు మండలాల కార్యదర్శులు గుజ్జుల మల్లికార్జున, రహంతుల్లా, మహిళా సంఘ అధ్యక్షురాలు మూలి ప్రమీల, సీనియర్ నాయకులు మహమ్మద్‌గౌస్, సుధాకర్, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిరుద్యోగులకు అండగా నిలవాలి



వింజమూరు(ఉదయగిరి): సమాజంలో క్షేత్రస్థాయిలో పనిచేసే పారిశుధ్య కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు వంటి చిరుద్యోగులకు అందరం అండగా నిలిచి వారి సమస్యలను పరిష్కారించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్ అన్నారు.వింజమూరులోని పంచాయతీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పంచాయతీ కార్మికులను సన్మానించారు. ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారి మురళి, జెడ్పీటీసీ గణపం బాలకృష్ణారెడ్డి, సర్పంచ్ ఎస్ సృజన, పంచాయతీ కార్యదర్శి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

ఆత్మకూరురూరల్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని ఆత్మకూరు ఐసీడీఎస్ సీడీపీఓ సునీలత అన్నారు. మండలంలోని మహిమలూరులో రాష్ట్రీయ పోషణ అభియాన్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లీబిడ్డల సంరక్షణపై అవగాహన కల్పించారు. సర్పంచ్ రేవతి, మాజీ ఎంపీటీసీ గార్లపాటి వేణుగోపాల్‌నాయుడు, దావా పెంచలరావు, అంగన్‌వాడీలు సామ్రాజ్యం, సురేఖ, మౌనిక, శారద, నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

రేపట్నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు



ఆత్మకూరురూరల్: ఆత్మకూరులోని ఉత్తరపు బలిజవీధిలోని జ్వాలాముఖి ఆలయంలో సోమవారం నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలను వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శనివారం వారు ఆలయ ప్రాంగణంలో శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. అక్టోబరు 2వ తేదీ వరకు ప్రతిరోజూ అమ్మవారు విశేషాలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. ఆలయ నిర్వాహకులు కృష్ణారెడ్డి, నారాయణ, గోవింద రెడ్డి, వెంకటేశ్వర్లు, అంకయ్య, నలిశెట్టి సుబ్బారావు పాల్గొన్నారు.

కిలో పొగాకు గరిష్ట ధర రూ.345

కలిగిరి: స్థానిక పొగాకు వేలం కేంద్రంలో శనివారం కిలో పొగాకు గరిష్ట ధర రూ.345 పలికింది. జనరల్ క్లస్టర్‌కు చెందిన రైతులు 786 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, 500 పొగాకు బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 286 బేళ్లను కొనుగోలుకు తిరస్కరించారు. వేలంలో కిలో పొగాకు గరిష్టంగా రూ.345, కనిష్టంగా రూ.90, సరాసరిన రూ.217.13 ధర పలికిందని వేలం నిర్వహణాధికారి శివకుమార్ తెలిపారు.

యువతి అదృశ్యంపై ఫిర్యాదు

ఉదయగిరి రూరల్: మండలంలోని పుల్లాయపల్లె గ్రామానికి చెందిన యువతి అదృశ్యంపై సోదరుడు రామాంజనేయులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నెల 13వ తేదీ నుంచి కనిపించడం లేదని, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ తెలియలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి తెలిపారు.

రైతులకు అందుబాటులో యూరియా

సీతారామపురం : అయ్యవారిపల్లి రైతుసేవా కేంద్రంలో 18 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు అందుబాటులో ఉందని ఏఓ చెన్నారెడ్డి శనివారం తెలిపారు. సోమవారం నుంచి రైతులకు పంపిణీ చేస్తామని చెప్పారు. రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జెరాక్స్ కాపీలు తీసుకుని వస్తే బయోమెట్రిక్ వేయించుకుని అందజేస్తామన్నారు.

జంగిల్ క్లియరెన్స్



ఉదయగిరి రూరల్: మండలంలోని గండిపాళెం పంచాయతీ పరిధిలో రోడ్లకు ఇరువైపులా పెరిగిన కంపచెట్ల తొలగింపు పనులను జీఎంకే ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. ఈ సందర్భంగా ట్రస్టు ప్రతినిధులు బీ వెంకటేశ్వర్లు, సీహెచ్ గోపి మాట్లాడుతూ జీఎంకే ట్రస్టు అధినేత, వైస్ఎంపీపీ గుంటుపల్లి మాల కొండయ్యచౌదరి పంచాయతీ పరిధిలో జంగిల్‌క్లియరెన్స్‌కు తన సొంత నిధులు రూ.లక్ష కేటాయించారని తెలిపారు. ఈ నిధులతో ఎస్సీ, బీసీ, కాలనీల్లోని రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ వైద్యశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలోని పిచ్చిచెట్లను తొలగించి శుభ్రం చేయనున్నట్లు తెలిపారు. స్థానికులు మాలకొండయ్య, గాంధీ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీఎస్‌యూ రిజిస్ట్రార్ సునీత్



కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

ఆత్మకూరురూరల్: క్రీడలు మానసికోల్లాసానికి ఎంతో దోహదపడుతాయని విక్రమ సింహపురి యూనివర్శిటి రిజిస్ట్రార్ డాక్టర్ కే సునీత అన్నారు. ఆత్మకూరులోని ఎస్సార్‌జే డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో వీఎస్‌యూ అంతర్ కళాశాలల క్రీడాపోటీలను స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో శనివారం ప్రారంభించారు. వీఎస్‌యూ రిజిస్ట్రార్ ముఖ్యఅధిగా హాజరై మాట్లాడారు. వీఎస్‌యూ పరిధిలో క్రీడాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు.అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకుని పోటీలను ప్రారంభించారు. కాగా కబడ్డీ పోటీల్లో ఆత్మకూరు ఎస్సార్‌జే డిగ్రీ కళాశాల, నెల్లూరు జెనెక్స్ డిగ్రీ కళాశాలలు ఫైనల్స్‌కు చేరుకున్నాయి. టగ్ ఆఫ్ వార్‌లో నెల్లూరు జెనెక్స్ కళాశాల విజేతగా, కావలి జేబీ కళాశాల రన్నర్‌గా నిలిచాయి. కళాశాల ప్రిన్సిపల్ వరకుమారి, వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ వెంకట్రాయులు, పోటీల నిర్వహణ కార్యదర్శి సిరిమామిళ్ల వెంకటేశ్వర్లు, వర్సిటీ పరిశీలకులు ప్రసాద్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు



చేజర్ల(సోమశిల): అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పంచాయతీల్లో పారిశుధ్యం మెరుగునకు చర్యలు తీసుకోవాలని చేజర్ల ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. చేజర్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలతో పారిశుధ్యం లోపించడంతో ప్రజలు విషజ్వరాల బారిన పడుతున్నారన్నారు. విషజ్వరాల నియంత్రణకు గ్రామాల్లో పారిశుధ్య చర్యలు చేపట్టాలని సూచించారు. వైద్యాఆరోగ్య శాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలకు వైద్యసేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అమర్, జెడ్పీటీసీ పీర్ల పార్థసారథి, సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ కేశవ చౌదరి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మలుపులు తిరుగుతున్న బోగోలు పంచాయతీ వ్యవహారం

బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీలో నిధుల దుర్వినియోగం, పంచాయతీ కార్యదర్శిపై ఆరోపణలు, విచారణల పర్వం రోజుకో మలుపు తిరుగుతోంది. పంచాయతీ నిధుల దుర్వినియోగం, ఇంటి పన్నుల వసూళ్లలో అవకతవకలపై పంచాయతీ పాలక సభ్యులు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో కావలి డీఎల్‌పీఓ విచారణ చేపట్టి నిధులు దుర్వినియోగమైనట్లు గుర్తించిన విషయం తెలిసిందే. అంతేకాకుండా సుమారు రూ.30లక్షల మేర నిధుల వినియోగంలో నిబంధనలు పాటించలేదని, అభ్యంతరకర రీతిలో ఖర్చు చేశారని విచారణలో స్పష్టం కావడంతో సర్పంచ్‌కు చెక్‌పవర్ రద్దుకు సంబంధించి షోకాజ్ నోటీసును కూడా జారీ చేశారు. కాగా నిధుల వినియోగంపై సర్పంచ్‌ను కూడా పంచాయతీ కార్యదర్శి తప్పుదోవ పట్టించినట్లు తాజాగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ నాయకులు ఏరికోరి పంచాయతీ కార్యదర్శిగా అబ్దుల్ జహీర్‌ను బోగోలుకు బదిలీ చేయించుకున్నారు. కూటమి నేతల అండతో పంచాయతీ కార్యదర్శి పాలకవర్గాన్ని లెక్క చేయకపోవడం, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటం విషయంలో పంచాయతీ పాలకవర్గంపై ఏకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాకుండా పంచాయతీ నిధులు ఇష్టారాజ్యంగా వినియోగించడం, సర్పంచ్‌ను కూడా తప్పుదోవ పట్టించడంపై వరుస ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు విచారణ నిర్వహించి పంచాయతీ కార్యదర్శిపై చర్యలకు సిఫారసు చేశారు. అదే విధంగా సర్పంచ్‌కు షోకాజ్ నోటీసు ఇవ్వడంతో సర్పంచ్ సైతం అవాక్కయ్యారు. నిధుల వినియోగంలో తనను కూడా తప్పుదోవ పట్టించారనే అంశంలో పంచాయతీ కార్యదర్శిపై సర్పంచ్ కూడా ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి పాటుపడాలి



మాట్లాడుతున్న సుధీర్‌బాబు

కొండాపురం: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఉపాధ్యాయులు నిరంతరం పాటు పడాలని జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి సుధీర్‌బాబు సూచించారు. కొండాపురంలో శనివారం జరిగిన క్లస్టర్ సముదాయ సమావేశాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. అనంతరం స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉన్నత పాఠశాల మైదానంలో మొక్కలు నాటారు. ఆయన వెంట ఎంఈఓ రవికుమార్, కొండాపురం క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడు రాధాకృష్ణ , ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ ఖాదర్‌బాషా ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ఆత్మకూరులో మొక్కలు నాటుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్



ఉదయగిరి:ప్రభుత్వ పాఠశాలలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు



అల్లూరు: మొక్కలను నాటుతున్న కమిషనర్, ఎస్సై, ఎంపీడీఓ

ఉదయగిరి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎస్సై ఏ శ్రీనివాసులు, డిప్యూటీ ఎంపీడీఓ కరీముల్లా అన్నారు. స్వర్ణాంధ్ర -స్వచ్ఛాంధ్రలో భాగంగా పట్టణంలో గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. సర్పంచ్ పాములూరి సామ్రాజ్యం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అలాగే ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ జీ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. గండిపాళెం జలాశయం వద్ద జలవనరుల శాఖ డీఈ చంద్రమౌళి ఆధ్వర్యంలో సిబ్బంది పిచ్చిమొక్కలు తొలగించి జనరేటర్ రూమును శుభ్రపరిచారు.

కావలి(అల్లూరు): పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ ఇళ్లలో మొక్కలను పెంచాలని కావలి కమిషనర్ శ్రావణ్ కుమార్ అన్నారు. స్థానిక 9వ వార్డులో గ్రీన్‌ఏపీ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటారు. మున్సిపల్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

- గ్రీన్‌ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలను నాటారు. కమిషనర్ ఉమామహేశ్వరరావు, ఎస్సై శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ రజనికాంత్, డీడీఓ వరప్రసాద్, ఏఎస్సై దాసు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: గ్రీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా ఆత్మకూరు పురపాలక సంఘ ఆవరణలో మున్సిపల్ చైర్‌పర్సన్ గోపారపు వెంకట రమణమ్మ, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ మాధవి మొక్కలు నాటారు. వైస్ చైర్మన్ సర్దార్, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రావు శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మాల్యాద్రి సేవలు మరువలేనివి



వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలం చాకలికొండలోని రాధాకృష్ణ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విశ్రాంత ఉపాధ్యాయుడు చల్లా మాల్యాద్రి సంస్మరణ సభను శనివారం నిర్వహించారు. మాల్యాద్రి చిత్రపటానికి పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాల్యాద్రి 35 ఏళ్లపాటు ఉపాధ్యాయుడిగా వివిధ హోదాల్లో పనిచేసి మంచి పేరు తెచ్చుకున్నారని, ఆయన విద్యాభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. ఎంఈఓ పోలుబోయిన రమేష్, పూర్వ విద్యార్థులు మాధవరపు శ్రీనివాసరావు, పెండేల కొండలరావు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.